నిషాచరుడు

కడపలో శంకరాపురం రోడ్డులో ఆరుబయటే మందు తాగుతున్న మందు బాబులు



"ఇవాళ గ్రామాలకు వెళితే మినరల్ వాటర్ లేని ఊరు ఉంటుందేమో కానీ ప్రతి గ్రామంలో మందుబాటళ్లు దొరుకుతాయి. ఇవాళ 2019 ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రతి అక్క చెల్లెమ్మలకు మాట ఇస్తున్నా.. మద్యపాన నిషేధం చేసి 2024లో ఓట్లు అడుగుతానని హామీ ఇస్తున్నా" ఇదీ జగన్ 2019 ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ. మాట తప్పను మడమ తిప్పను ఇచ్చిన మాట కోసం కట్టుబడి ఉంటాను అంటూ జగన్ ఎప్పుడూ చెబుతూ ఉంటారు. ఎన్నికల మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీతతో సమానమంటూ 2019 ఎన్నికల్లో చెప్పుకొచ్చారు. మాట ఇచ్చి మడమ తిప్పను అని చెప్పిన జగన్.. ఇచ్చిన మాటను మడత పెట్టేశాడు. మద్యపాన నిషేధం అంటూ మహిళల ఓట్లను గంపగుత్తగా పొందిన జగన్ సీఎం అయిన తరువాత ఆ హామీకి తూట్లు పొడిచాడు. జగన్ పాలనలో జిల్లాలో 500 వెయ్యి కోట్లు కాదు.. నాలుగువేల కోట్ల రూపాయల మద్యం అమ్మకాలు సాగాయి. సంక్షేమం సంక్షేమం అని జపం చేసే జగన్ మద్యం ద్వారానే మందుబాబుల నుంచి రూ.4వేల కోట్లు లాగాడని చూస్తే ఔరా అనిపిస్తుంది.

- అధికారంలోకి వస్తే దశల వారీగా మద్యనిషేధం..
- మద్యపానం నిషేధం చేసి 2024 ఎన్నికల్లో ఓట్లు అడుగుతానంటూ జగన్ హామీ
- మినరల్‌వాటర్ లేని ఊరు ఉంటుందేమో కానీ.. లిక్కర్ లేని ఊరు లేదు
- నాలుగేళ్లలో 4వేల కోట్ల మద్యం అమ్మకాలు

(కడప-ఆంధ్రజ్యోతి): మద్యం రక్కసి వల్ల మహిళల పుస్తెలు తెగుతున్నాయంటూ అప్పట్లో వైసీపీ నేతలు వాపోయారు. అధికారంలోకి వస్తే దశలవారీగా మద్య నిషేధం చేస్తామంటూ జగనే హామీ ఇచ్చాడు. గద్దెనెక్కాక హామీ మరిచాడు. మద్యం దుకాణాలు తనే (ప్రభుత్వమే) నడపడం మొదలు పెట్టాడు. కొన్ని లిక్కర్ షాపులు తగ్గించాడు. తరువాత రేట్లు పెంచాడు. దశల వారీగా మద్యనిషేదంలో భాగంగానే షాపుల కుదింపు, బాటిల్ పట్టుకుంటే షాక్ కొట్టే విధంగా రేట్లు పెంచామంటూ కవరింగ్ ఇచ్చుకున్నారు. రకరకాల పిచ్చి బ్రాండ్లు ఉండడం, పొరుగు మద్యం వరదలా ప్రవహించంతో మళ్లీ నాలుక మడతేసి రేట్లు తగ్గిస్తూ వచ్చారు.

ఎక్కడా లేని బ్రాండ్లు

ఉమ్మడి రాష్ట్రంలో, గత ప్రభుత్వ హాయంలో దేశంలో లభ్యమయ్యే మద్యం బ్రాండ్లు ఇక్కడా దొరికేవి. జగన్ సీఎం అయిన తరువాత 2019 అక్టోబరు నుంచి ప్రైవేటు మద్యం షాపుల స్థానంలో ప్రభుత్వమే మద్యం అమ్మకాలు చేపట్టింది. ఆ తరువాత నుంచి మద్యం దుకాణాల్లో ఎప్పుడూ వినని పేర్లు, బ్రాండ్లు వెలిశాయి. పేర్లలో అయితే భూం భూం, బ్లాక్‌బస్టర్, మెగా డీఎస్పీ.. ఇక చీప్ లిక్కర్ అయితే దారూ హౌస్ తదితర పేర్లతో వచ్చాయి. ఇలాంటి పిచ్చి పిచ్చి పేర్లు ఉంటాయని కూడా ఊహించరు. గతంలో ఫలానా బ్రాండు మద్యం కావాలని అడిగేవారు. అయితే జగన్ తెచ్చిన మందు పేర్లు తెలియక పోవడంతో 150 మందు ఉందా, 170 మందు ఉందా అంటూ అడుగుతున్నారు. ఇది నాసిరకం మద్యం అంటూ ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో విమర్శించాయి. జగన్ మందు తాగిన వారికి లివర్ పాడవడంతో పాటు మతిమరుపు వస్తుందంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. మద్యం బ్రాండ్లపై తీవ్ర దుమారం రేగినా జగన్ ప్రభుత్వం తగ్గేది లేదంటూ అవే బ్రాండ్లు అమ్ముతూ వచ్చింది.

ఓన్లీ క్యాష్

కరోనా తరువాత నగదు రహిత లావాదేవీలు పెరిగాయి. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, అమేజాన్ పే లాంటి రకరకాల పేమెంటు యాప్‌లు వచ్చాయి. మారుమూల పల్లెల్లో కూడా ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీయం ద్వారా సిగరెట్ మొదలు పెద్ద పెద్ద వస్తువుల కొనుగోళ్ల వరకు లావాదేవీలు సాగుతున్నాయి. కానీ మద్యం షాపుల్లో మాత్రం ఓన్లీ క్యాష్.. నో క్యాష్‌లెస్. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా విమర్శలు రావడంతో గత ఏడాది మూన్నాళ్ల ముచ్చటగా కొద్దిరోజులు డిజిటల్ లావాదేవీలు నిర్వహించి మరలా షరా మామూలుగా క్యాష్‌తోనే మందు అమ్ముతున్నారు.

ఎక్కడ చూసినా మద్యమే

మద్యానికి అలవాటు పడ్డ కొందరు జగన్ పుణ్యమా అని వైసీపీ బ్రాండ్ మద్యం తాగలేకపోతున్నారు. మద్యానికి బానిస అయినవారంతా పొరుగు రాష్ట్రాలపై దృష్టిపెట్టారు. తెలంగాణ, కర్ణాటక, గోవా, మహారాష్ట్ర ఇతర రాష్ట్రాల మద్యం వైపు మళ్లారు.. ఇక పల్లెల్లో కూడా జగన్ మద్యంతో పాటు పొరుగు రాష్ట్రాల మద్యం కూడా పుష్కలంగా దొరుకుతుందని అంటున్నారు. అప్పట్లో మినరల్ వాటర్ లేని గ్రామం ఉందేమో కానీ మందుబాటల్ లేని ఊరే లేదంటూ జగన్ చెప్పేవారు. నిజమే.. ఇప్పుడు కూడా జిల్లాలో మినరల్ వాటర్ దొరకని ఊరు ఉందేమో కానీ మందుబాటల్ దొరకని ఊరు లేదంటారు.

గుటగుట తాగేశారు

బటన్ నొక్కుడు ద్వారా సంక్షేమ పథకాలకు వందల కోట్లు మీ అకౌంటులో వేస్తున్నా అని చెప్పడానికి ఎంతో గర్విస్తున్నా.. అని జగన్ తరచూ చెబుతుంటారు. కానీ ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో లాక్కుంటున్నారన్న విషయాన్ని ఇప్పుడిప్పుడే జనం గుర్తిస్తున్నారు. సంక్షేమ పథకాలకు కొంత ఇచ్చి మద్యం ద్వారా భారీగా లాక్కుంటున్నట్లు అర్థమవుతుంది. నాలుగేళ్ల మద్యం అమ్మకాలు పరిశీలిస్తే రూ.3,009.98 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి.

2020-21 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.607,80,38,844, 2021-22లో రూ. 722,32,21,696, 2022-23లో రూ.814,57,54,992, 2023-24లో ఈ నెల మార్చి 30 నాటికి రూ.865,28,75,618 మద్యం అమ్మకాలు జరిగాయి. మొత్తం కలుపుకుంటే రూ.3009,98,91,150 అమ్మకాలు సాగాయి. జగన్ ప్రభుత్వం కొలువుదీరాక 2019 నుంచి 2020 మార్చి ఆర్థిక సంవత్సరం వరకు జరిగిన మద్యం అమ్మకాలు ఎంత లేదన్నా వెయ్యి కోట్లు పైమాటే ఉంటుంది. అంటే.. ఈ ఐదేళ్లలో అమ్మకాల సంఖ్య 4వేల కోట్లకు పైగా జరిగింది.



ఇదీ జగన్ మార్కు మద్య నిషేధం

మద్య నిషేధం చేస్తామని జగన్ హామీ ఇవ్వగానే.. కుటుంబాలు బాగుపడతాయని మహిళలు సంతోషించారు. కష్టపడే సొమ్మంతా తాగుడుకే తగలేస్తున్నారని జగన్ సీఎం అయితే తమ బతుకులు మారిపోతాయని మహిళలు సంబరపడ్డారు. మందులేని ఊర్లు, మందుతాగని మొగుళ్లను చూడవచ్చని భార్యలు.. తమ నాన్నతాగడులే అని పిల్లలు ఇలా అందరూ సంతోషించారు. అందుకే మహిళలు జై జగన్ అంట ఓట్లు గుద్దేశారు. అయితే జగన్ దశల వారీగా మద్యనిషేధం అటుంచితే.. రాబోయే మద్యం ఆదాయం తాకట్టుపెట్టి రుణం తెచ్చారు. వచ్చే ప్రభుత్వం కూడా మద్యనిషేధం చేయలేని విధంగా తెచ్చారు. ఇదే జగనన్న మార్కు మద్యనిషేదం అంటూ విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇంటర్ ఫలితాలు విడుదల

- జిల్లాలో 69 శాతం ఉత్తీర్ణత
- 22వ స్థానంలో జిల్లా

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 12: ఇంటర్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. జిల్లాలో 69 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో 26 జిల్లాలుండగా వైఎస్సార్ కడప జిల్లా 69 శాతంతో 22వ స్థానంలో నిలిచింది. శుక్రవారం తాడేపల్లిలో ఇంటర్ బోర్డు కార్యదర్శి సౌరబ్‌గౌర్ ఫలితాలను విడుదల చేశారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు ఒకేసారి విడుదల చేశారు. జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 12,131 మంది పరీక్షలకు హాజరుకాగా, 8,375 మంది (69 శాతం) ఉత్తీర్ణత సాధించారు వారిలో బాలురు 5,504 మందికి గాను 3,575 మంది (65 శాతం) ఉత్తీర్ణత సాధించగా.. బాలికలు 6,687 మందికి గాను 4,800 మంది (72 శాతం) ఉత్తీర్ణత సాధించారు. అలాగే ప్రథమ సంవత్సరం ఫలితాలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 14,470 మంది పరీక్షలకు హాజరు కాగా 7,954 మంది (55శాతం) ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 6,615 మందికి గాను 3,246 మంది (49 శాతం), బాలికలు 7,855 మందికి గాను 4,708 మంది (60శాతం) ఉత్తీర్ణత శాతం సాధించారు. ప్రథమ, ద్వితీయ ఇంటర్ ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. గత సంవత్సరాలతో పోలిస్తే జిల్లాలో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు వచ్చాయని చెప్పాలి. 2020లో 53 శాతం ఉత్తీర్ణత సాధించగా.. 2021లో కరోనా నేపథ్యంలో అందరినీ పాస్ చేసేశారు. 2022లో 50శాతం, 2023లో 60 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఈ ఏడాది 69 శాతంతో కాస్త మెరుగైన ఫలితాలు సాధించింది. అయినా.. రాష్ట్రంలో 22వ స్థానంలో మాత్రమే నిలిచింది.

మేనేజ్‌మెంటు వైడ్ ఫలితాలు

జిల్లాలో మేనేజ్‌మెంటు వారీగా.. ద్వితీయ సంవత్సరం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1,455మందికి గాను 889 మంది (61శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఎయిడెడ్ కళాశాలల్లో 197 మందికి గాను 69 మంది (35శాతం), హైస్కూలు ప్లస్ 66 మందికి గాను 13 మంది (20శాతం), మోడల్ స్కూలు 190 మందికి గాను 113 మంది (59 శాతం), ఏపీఎస్‌డబ్ల్యుఆర్ 556 మందికి గాను 396 మంది (71శాతం), కేజీబీవీ 275 మందికి గాను 187 మంది (68 శాతం), కో ఆపరేటివ్ 52మందికి గాను 18 మంది (35శాతం), ప్రైవేటు జూనియర్ కళాశాలలు 9,340 మంది విద్యార్థులకు గాను 6,690 మంది (72 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఆర్‌ఐవో వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్‌లో ఈ ఏడాది మంచి ఫలితాలు సాధించామన్నారు. గత పదేళ్లలో ఈ ఏడాది అత్యధిక ఉత్తీర్ణత శాతంతో మెరుగైన ఫలితాలు వచ్చాయన్నారు.

పకడ్బందీగా మొదటి విడత ర్యాండమైజేషన్

- ఈవీఎంలను తరలించే వాహనాలకు జీపీఎస్
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు



ర్యాండమైజేషన్ గురించి వివరిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 12: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామాగ్రిని కేటాయించే మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను సజావుగా పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్‌పీసీ హాలులో నిర్వహించిన జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, డీఆర్వో గంగాధర్ గౌడ్‌తో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్ణయించిన మేరకు శుక్రవారం పకడ్బందీగా ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ చేపట్టామన్నారు. దీనికోసం ఎన్నికల కమిషన్ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఈఎంఎస్ యాప్‌ను అభివృద్ధి చేసిందన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్‌లైన్ ద్వారా అత్యంత పారదర్శకతతో ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ చేపట్టామన్నారు. ముందుగా పార్లమెంటరీ నియోజకవర్గ స్థానానికి సంబంధించిన ఈవీఎంల ర్యాండమైజేషన్ చేపట్టామని, అనంతరం జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ పూర్తిచేశామని అన్నారు. ఈ వీఎంలను తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఉంటుందన్నారు. పటిష్ట పోలీసు బందోబస్తుతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంలను పంపిస్తామన్నారు. ఈ సమావేశంలో ఈవీఎంల నోడల్ అధికారి వెంకటపతి, అన్ని నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు, సంబంధిత నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రచారంలో పాల్గొన్న వలంటీర్‌పై కేసు నమోదు

కొండాపురం, ఏప్రిల్ 12: మండలంలోని రామిరెడ్డిపల్లెలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో పాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నందుకు వలంటీర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటూరు వలంటీర్ మలికిరెడ్డి రోహిత్‌రెడ్డి ఎమ్మెల్యేతో పాటు ప్రచారంలో పాల్గొన్నట్లు సి-విజిల్ యాప్‌లో పలువురు ఫిర్యాదు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఆదేశాల మేరకు ఎంపీడీవో నాగప్రసాద్ విచారించారు. నిజమని తేలడంతో వలంటీర్ పై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు వలంటీర్‌పై కేసు నమోదు చేశామని తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

ప్రతిష్టాత్మకంగా కోదండరాముని బ్రహ్మోత్సవాలు

- 22న సీతారాముల కల్యాణం
- టీటీడీ ఈవో ధర్మారెడ్డి

ఒంటిమిట్ట, ఏప్రిల్ 12: ఆంధ్ర భద్రాద్రిగా పేరుగాంచిన కోదండరాముని బ్రహ్మోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని టీటీడీ ఈవో ఏ.వి.ధర్మారెడ్డి అన్నారు. ఇందులో భాగంగా సీతారామ కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సిద్ధార్థ కౌశల్‌తో కలిసి శుక్రవారం ఈవో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పీఏసీలోని సమావేశ హాలులో బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవ ఏర్పాట్లపై జిల్లా, టీటీడీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఏప్రిల్ 22న సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు జరిగే సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయలన్నారు. కల్యాణానికి వచ్చే భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, విరివిగా అందేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటర్లలోనూ, గ్యాలరీలలో ఉన్న భక్తులకు ప్రసాదాల పంపిణీకి అవసరమైనంత మంది శ్రీవారి సేవకులను సిద్ధం చేసుకోవాలని, భద్రత, శానిటేషన్, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీరు, అన్నప్రసాదాలు, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ కంట్రోల్, ఆర్టీసీ రవాణా సౌకర్యం, సూచిక బోర్డులు, కంట్రోల్ రూం, సీసీ కెమెరాలు, కల్యాణోత్సవం సందర్భంగా విద్యుద్దీకరణ అంశాలు, అగ్నిమాపక వాహనం, వైద్య ఆరోగ్య శాఖ వారిచే వైద్య శిబిరం, హెల్ప్ డెస్కుల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ ఏడాది భక్తులకు కావాల్సిన అన్ని రకాల వసతులను శాశ్వత ప్రాతిపదికన నిర్మించినట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ ఏప్రిల్ 15వ తేదీలోపు బ్రహ్మోత్సవాల పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా అదనపు బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కల్యాణ వేదిక వద్ద గ్యాలరీలు, పటిష్టమైన బారికేడ్లు, సీసీ కెమెరాల ఏర్పాటు, భక్తుల కోసం వైద్య శిబిరాలు, ప్రథమ చికిత్స కేంద్రాలతో పాటు పారా మెడికల్ సిబ్బంది, మందులు, అంబులెన్సులు, గ్లూకోజ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ గణేశ్‌కుమార్, కడప మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్, ఎస్‌వీబీసీ సీఈవో షణ్ముకకుమార్, డీఆర్‌వో గంగాధర్‌గౌడ్, టీటీడీ సీఈ నాగేశ్వరరావు, కడప ఆర్డీవో మధుసూదన్‌రావు, వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

శాస్త్రోక్తంగా కోయిల్ ఆల్వార్ తిరుమంజనం

ఆలయంలో కోయిల్ ఆల్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏప్రిల్ 17-25 వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. అందులో భాగంగా తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కోయిల్ ఆల్వార్ తిరుమంజనం నిర్వహించారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చిఆకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర మిశ్రమాన్ని రామాలయం గోడలు, పైకప్పు పూజా సామగ్రి, రామాలయం ధ్వజ స్తంభాలకు సంప్రోక్షన నిర్వహించి శుద్ధి చేపట్టారు. అనంతరం భక్తులను స్వామి వారి దర్శనానికి అనుమతించారు. కాగా ఈ కార్యక్రమాన్ని ఉదయం 8 గంటల నుంచి చేపడుతున్నట్లు ముందుగా టీటీడీ అధికారులు సమాచారం ఇచ్చారు. కానీ టీటీడీ ఈవో ధర్మారెడ్డి పర్యటన నేపథ్యంలో ఉదయం 6 గంటల నుంచి రామాలయంలో ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టడంతో... సంరక్షణలో పాల్గొనాలనుకున్న భక్తుల నుంచి విమర్శలు ఎదురయ్యాయి.

కల్యాణోత్సవ సమయంలో మార్పు

కోదండరాముని బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణోత్సవ సమయంలో మార్పులు చేపట్టారు. గత కొన్నేళ్లుగా రామాలయంలో రాత్రి 8గంటల నుంచి 10.30 గంటల సమయంలో నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుంది. టీటీడీ పాలక మండలి నిర్ణయం మేరకు సాయంత్రం 6 గంటల నుంచి 8.30 గంటల మధ్య నిర్వహిస్తున్నట్లు అధికారులు ప్రకటనలో తెలిపారు. ఒంటిమిట్ట కోదండరాముని కల్యాణోత్సవానికి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. రాత్రివేళ పండు వెన్నెలలో నిర్వహిస్తారు. ఈ ప్రాంతవాసులకు కోదండరాముని కళ్యాణ ఉత్సవం ఓ పండువగా కొనసాగుతుంది.



వేంపల్లెలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

మేమూ పులివెందుల బిడ్డలమే

- ఒకవైపు వైఎస్సార్ బిడ్డ... మరోవైపు హంతకుడు
- ఒకవైపు న్యాయం, ధర్మం... మరోవైపు ధనబలం, అధికారబలం
- వైఎస్సార్ బిడ్డ కావాలో..
- వైఎస్ వివేకా హత్య నిందితుడు కావాలో ప్రజలు తేల్చుకోవాలి
- జగన్ పులివెందుల పిల్లి
- పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల
- పులివెందుల నియోజకవర్గంలో షర్మిలకు జనం జేజేలు

పులివెందుల/వేంపల్లె/సింహాద్రిపురం/వేముల/లింగాల, ఏప్రిల్ 12: "మేమూ పులివెందుల బిడ్డలమే. వైఎస్సార్ బిడ్డగా కొంగుచాచి అడుగుతున్నా.. న్యాయనిర్ణేతలు మీరే. ఒకవైపు వైఎస్సార్ బిడ్డ, మరోవైపు వివేకా హత్య నిందితుడు అవినాశ్‌రెడ్డి.. ఎవరు కావాలో మీరే తేల్చండి" అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు.

కడప ఎంపీ స్థానానికి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న వైఎస్ షర్మిల న్యాయ్ యాత్ర పేరిట బస్సుయాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం వేంపల్లె నుంచి వేముల, పులివెందుల, లింగాల, సింహాద్రిపురం మండలాల మీదుగా బస్సుయాత్ర సాగింది. రాత్రి 7 గంటల ప్రాంతంలో పులివెందులలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద (పూలంగళ్ల సర్కిల్) ప్రజలనుద్దేశించి షర్మిల మాట్లాడారు. వీధిలైట్లు వెలగకపోవడంతో ఆమె ఘాటుగా స్పందించారు. మామూలుగానే లైట్లు ఉండవా లేక మేము వస్తున్నామని లైట్లు తీసేశారా అని ప్రశ్నించారు. మామూలుగా లైట్లు ఉండవు అంటే ముఖ్యమంత్రిగా ఫెయిల్ అయినట్లు మేము వస్తున్నాము అని లైట్లు తీసేశారంటే అవినాశ్‌రెడ్డి భయంతో వణికిపోతూ ఓటమిని ఒప్పుకొన్నట్లు అన్నారు. చిన్నాన్న విషయంలో అన్యాయం జరిగిందన్నారు. వివేకానందరెడ్డిని హత్య చేసి ఐదేళ్లు అయిందన్నారు. ఈరోజు వరకు న్యాయం జరిగిందా అన్నారు. చంపించింది అవినాశ్‌రెడ్డి అని సీబీఐ చెబుతున్న కూడా స్వయానా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన అధికారాన్ని అడ్డం వేసి మరీ కాపాడుతున్నారన్నారు. జగనన్నను సూటిగా ప్రశ్నిస్తున్నా జనం మీకు ఓట్లు వేసింది ఎందుకు అన్నారు. ప్రత్యేక హోదా కోసం నిరాహారదీక్షలు చేస్తే, ప్రత్యేక హోదా కోసం మూకుమ్మడి రాజీనామాలు చేద్దామని చంద్రబాబుకు సవాల్ విసిరితే మిమ్మల్ని నమ్మి జనాలు ఓటేశారన్నారు. పులివెందుల పులి అన్నారు.. జగన్‌మోహన్‌రెడ్డి బీజేపీకి, మోదీకి పిల్లిలా మారారన్నారు. బీజేపీకి ఎందుకు బానిసయ్యారని ప్రశ్నించారు. వేంపల్లెలో డాక్టర్ సునీత మాట్లాడుతూ.. వైఎస్ వివేకానందరెడ్డికి వేంపల్లెతో ఎంతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. తన తండ్రిని ఘోరంగా చంపారని, చంపిన వారికి శిక్ష పడేలా చేస్తున్న న్యాయపోరాటానికి మీ మద్దతు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మంచి చేసేందుకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బిడ్డ ఎంపీగా నిలిచింది.. ఆమెకు మీ మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

కిక్కిరిసిన నాలుగురోడ్ల కూడలి

పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేపట్టిన బస్సు యాత్ర వేంపల్లెలో విజయవంతమైంది. సొంత నియోజకవర్గంలోని పెద్ద మండలమైన వేంపల్లె నుంచి శుక్రవారం బస్సుయాత్ర ప్రారంభించారు. మధ్యాహ్నం 11గంటల ప్రాంతంలో స్థానిక నాలుగురోడ్ల కూడలిలో కిక్కిరిసి ఉన్న జనాన్ని ఉద్దేశించి షర్మిల మాట్లాడారు. మొదట బస్సు పైకి ఎక్కిన షర్మిల ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీని సాగించారు. వేంపల్లెలో షర్మిల బస్సు యాత్రకు సీపీఐ, ఏఐటీయూసీ, ఆమ్‌ఆద్మీపార్టీ, భవన నిర్మాణ కార్మిక సంఘం తదితరులు మద్దతుగా మాట్లాడారు. సింహాద్రిపురం, లింగాలలోనూ జనం పెద్దఎత్తున హాజరయ్యారు. పులివెందుల పూలంగళ్ల కూడలిలో ఇసుక వేస్తే రాలనంతగా జనం వచ్చారు. మిద్దెలపైకి ఎక్కి మరీ అక్కాచెల్లెళ్ల ప్రసంగాన్ని విన్నారు.

పూలంగళ్ల వద్ద పంచాయితీకి సిద్ధమా

- అవినాశ్‌రెడ్డికి సవాల్ విసిరిన డాక్టర్ సునీత

సింహాద్రిపురం, లింగాలలో వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత మాట్లాడుతూ కొద్ది సేపట్లో పులివెందుల పూలంగళ్ల సర్కిల్ లో సమావేశంలో మాట్లాడబోతున్నాం. అక్కడ ప్రజల సమక్షంలో అవినాశ్‌రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే.. మాముందుకు వచ్చి మాట్లాడవచ్చని సవాల్ విసిరారు.

వైసీపీ కవ్వింపు చర్యలకు ధీటుగా షర్మిల సమాధానం

లింగాల మండలంలో ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేపట్టిన బస్సు యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. లింగాలలో వైఎస్ షర్మిల మాట్లాడుతున్న సమయంలో రాజశేఖర్‌రెడ్డి ఎలాంటి వారు, వివేకానందరెడ్డి ఎలాంటి వారు అని ప్రజలను అడిగితే వారు జై వైఎస్సార్ అని నినదించారు. ఎంపీగా అవినాశ్‌రెడ్డి ఏం చేశారని ప్రశ్నిస్తే ఏం చేయలేదంటూ సమాధానం ఇచ్చారు. వైఎస్ వివేకాను హత్య చేసింది, చేయించింది అవినాశ్‌రెడ్డి అని మేము చెప్పామా అని ప్రశ్నిస్తే లేదు సీబీఐ అని అన్నారు. వైఎస్ షర్మిల, వైఎస్ సునీతలు మాట్లాడే సమయంలో జై జగన్ అని కొందరు, వైసీపీ జెండాలతో కొందరు కవ్వింపులకు దిగారు. వీరినుద్దేశించి వైఎస్ షర్మిల మాట్లాడుతూ అవినాశ్‌రెడ్డి ఎంపీగా ఓడిపోతాడు అనే భయం మీకు ఉంది కాబట్టే ఈరోజు తమను అడ్డుకుంటున్నారన్నారని సమాధానమిచ్చారు. కొందరు వైసీపీ జెండాలు పట్టుకొని రాగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. జై జగన్ అని కొందరు వైసీపీ కార్యకర్తలు నినదిస్తే జై షర్మిల అంటూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నినదించారు.



పులివెందుల పూలంగళ్ల సర్కిల్‌లో వైఎస్ షర్మిల ప్రసంగం వినేందుకు మేడలపైకి ఎక్కిన జనం

16న శ్లాష్ పరీక్ష : డీఈవో


మాట్లాడుతున్న డీఈవో అనురాధ

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 12: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 16న స్టేట్ లెర్నింగ్ అచీవ్‌మెంటు సర్వే (శ్లాష్) నిర్వహిస్తున్నట్లు డీఈవో ఎం.అనురాధ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరం జయనగర్ కాలనీ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో డీసీఈబీ సెక్రటరీ శంకరయ్య, ఏఎంఓ ధనలక్ష్మి సంయుక్త ఆధ్వర్యంలో ఎంఈవోలకు, సీఆర్పీలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర కార్యాలయం ఉత్తర్వుల మేరకు శ్లాష్ పరీక్షను సీఆర్పీ ద్వారా సమీప మండలాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈపరీక్షలకు సంబంధించి ఇప్పటికే ప్రశ్నాపత్రాలు ఓఎంఆర్ షీట్లు మండల కార్యాలయాలకు చేరాయన్నారు. కేటాయించిన పాఠశాలలో సీఆర్ఎంటీలు సర్వే పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వీరికి సంబంధించి ఎంఈవోలు కేటాయించిన పాఠశాలల వివరాలను సీఆర్పీలకు సహకరించాలని ఆదేశిం చారు. అనంతరం సంబంధిత సెక్టోరియల్ అధికారులు ఎండీఎం, నాడు నేడు ఎలక్షన్ డ్యూటీ, డీసీఈ మార్కుల నమోదు, టోఫెల్ పరీక్ష, కెరియర్ గైడెన్స్‌పై క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాగ్యవతి, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి వీక్లీబెస్ట్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు


వీక్లీబెస్ట్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు అందుకున్న సిబ్బంది

కడప (క్రైం), ఏప్రిల్ 12: పోలీసు సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి వీక్లీ బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ అవార్డును అందిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఒక సివిల్, ఏఆర్ విభాగం నుంచి ఒకరు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో నుంచి ఇద్దరిని ఎస్పీ ఎంపిక చేసి నగదు రివార్డులు, ప్రశంసాపత్రం అందించి అభినందించారు. తాళ్లప్రొద్దుటూరు పోలీసుస్టేషన్ పరిధిలో ఎటువంటి బిల్లులు లేకుండా నగదు తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేయడంలో కృషి చేసిన కానిస్టేబుల్ దస్తగిరి, యాంటి రైట్ డ్రిల్‌ను సిబ్బందికి తర్ఫీదు ఇవ్వడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ షేక్ ఖలందర్, ఇటీవల బద్వేలులో అక్రమంగా తర లిస్తున్న 177 ఫుల్‌బాటళ్ల డిఫెన్స్ మద్యాన్ని పట్టుకుని సీజ్ చేయడంలో కృషి చేసిన ఇంటెలిజెన్స్ వింగ్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో హెడ్ కానిస్టేబుల్స్ ఓబుల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రం, నగదు రివార్డులు అందించారు.

అరుణాచల గిరి ప్రదక్షణకు ప్రత్యేక బస్సులు

కడప (మారుతీనగర్) ఏప్రిల్ 12: తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైలో వెలసిన అరుణాచల గిరి ప్రదక్షణకు జిల్లాలోని వివిధ డిపోల నుంచి ఈనెల 22, 23 తేదీలలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప డిపో నుంచి ఉదయం 5 గంటలకు బస్సు బయలుదేరి వయా రాయచోటి, చిత్తూరు వేలూరు మీదుగా అరుణాచలం చేరుకుంటుంది. అలాగే బద్వేలు డిపో నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరి వయా గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా వెళుతుంది. మరో బస్సు కూడా ఉదయం 7గంటలకే బయలుదేరి పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా అరుణాచలం చేరుకుంటుంది. మైదుకూరు డిపోకు సంబంధించి ఉదయం 6 గంటలకు పోరుమామిళ్ల నుంచి బయలుదేరి వయా మైదుకూరు, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా చేరుకుంటుంది. ప్రొద్దుటూరు డిపో నుంచి రాత్రి 9 గంటలకు బయలుదేరి వయా మైదుకూరు, కడప మీదుగా అరుణాలం చేరుకుంటుంది. జమ్మలమడుగు డిపో నుంచి రాత్రి 7గంటలకు ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా... పులివెందుల డిపో నుంచి ఉదయం 7 గంటలకు బస్సులు బయలుదేరి పీలేరు, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం చేరుకుంటాయి.

డిపో	సర్వీస్ నెంబర్	సమయం	బస్సు రకం	టికెట్ ధర
కడప	6002	05.00	సూపర్‌లగ్జరీ	1,072
బద్వేల్	9569	07.00	అల్ట్రా డీలక్స్	1,566
బద్వేల్	60009	07.00	సూపర్‌లగ్జరీ	1,475
మైదుకూరు	97876	06.00	సూపర్‌లగ్జరీ	1,414
ప్రొద్దుటూరు	9944	21.00	సూపర్‌లగ్జరీ	1,273
పులివెందుల	59900	07.00	సూపర్‌లగ్జరీ	1,242
జమ్మలమడుగు	98398	19.00	సూపర్‌లగ్జరీ	1,352

నాన్ సీబీఎస్ఈ పాఠశాల్లో నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్ వర్క్ ప్రవేశపెట్టాలి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 12: విద్యార్థులను స్వయంపోషక జీవులుగా తయారు చేసే నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ విధానం కేవలం సీబీఎస్ఈ పాఠశాలల్లో ప్రారంభిస్తున్నారని.. దీన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవరించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్, చెంగల్‌రెడ్డి, ఈశ్వర్‌చంద్ర, ఆలీఖాన్ సంయుక్త ప్రకటనలో కోరారు. నాన్ సీబీఎస్ఈ పాఠశాల్లో కూడా ఈ విధానం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. దీంతో విద్యార్థులకు పలు రకాలైన వృత్తి విద్య నైపుణ్యాలు పెంపొందించే అవకాశం ఉంటుందన్నారు.

పకడ్బందీగా మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్


రాజకీయ పార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 12: ఈవీయంలు, వీవీ ప్యాట్‌ల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సాధారణ ఎన్నికలు-2024లో భాగంగా ఈవీయంలు, వీవీ ప్యాట్‌ల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఈవీయంలు, వీవీ ప్యాట్స్‌ల ర్యాండమైజేషన్ కోసం నూతన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించడం జరిగిందన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అత్యంత పారదర్శకతతో ఈవీయంలు, వీవీ ప్యాట్స్‌ల మొదటి ర్యాండమైజేషన్‌ను చేపట్టడం జరిగిందన్నారు. ఈవీయం, వీవీ ప్యాట్స్ యంత్రాలు తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ తప్పనిసరిగా ఉంటుందని, సెక్యూరిటీ ప్రోటోకాల్ ప్రకారం పటిష్ట బందోబస్తుతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీయం, వీవీ ప్యాట్స్ యంత్రాలను తరలించడం జరుగుతుందన్నారు. ఈవీయంలు, వీవీ ప్యాట్స్‌ల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో సత్యనారాయణ, ఆర్డీవోలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదు

వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో సాధారణ ఎన్నికల నిర్వహణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొనరాదన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాలు నిర్వహించే రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలను పాటిస్తూ సంబంధిత రిటర్నింగ్ అధికారుల వద్ద అనుమతి పొందాలన్నారు. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను సంసిద్ధం చేశామని, జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా మోడల్‌కోడ్ ఉల్లంఘన చర్యలపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టడం జరుగుతోందన్నారు. ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు ప్రత్యక్ష ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వెంటనే విచారించి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

రూ.20లక్షల నగదు పట్టివేత


స్వాధీన పరుచుకున్న నగదును చూపుతున్న సీఐ

రాజంపేట టౌన్, ఏప్రిల్ 12 : రాజంపేట పట్టణంలో నిఎర్రబల్లిలో మెగదాష్ నరేష్ స్వగృహంలో రూ.20లక్షల నగదు పట్టుకున్నట్లు డీఎస్పీ చైతన్య పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎర్రబల్లిలో ఓ ఇంటిలో నగదు ఉన్నట్లు సమాచారం అందడంతో పట్టణ సీఐ మద్దయ్య ఆచారి తమ సిబ్బందితో నరేష్ స్వగృహంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి.. ఎటువంటి పత్రాలు లేని రూ.20 లక్షల నగదును స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా ఎలాంటి పత్రాలు లేని 50వేలు మించి నగదు ఉంటే దానికి సరైన ఆధారాలు చూపాలన్నారు. లేనిపక్షంలో నగదును సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కడపలో రూ..ఐదు లక్షలు...

కడప (క్రైం), ఏప్రిల్ 12: కడప నగరం అప్సరా సర్కిల్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టి ఓ వ్యక్తి వద్ద ఉన్న రూ.5లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ రవికుమార్ తన సిబ్బందితో శుక్రవారం సాయంత్రం అప్సర సర్కిల్ సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు. ప్రకాశ్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా తనిఖీ చేసి అతని వద్ద ఉన్న రూ.5.90 లక్షలు నగదు సీజ్ చేశారు. ఐరన్ కొనుగోలు కోసం అప్సరావద్ద బ్యాంకులో నగదు డ్రా చేసుకుని వెళు తుండగా పోలీసులు ఆ నగదు పట్టుకున్నట్లు తెలుస్తుంది.

రాయచోటిలో రూ.2 లక్షలు...

రాయచోటిటౌన్, ఏప్రిల్ 12: రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఎస్ఐ లోకేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని ఠాణా సమీపంలో షిఫా హాస్పిటల్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తూ ఉండగా మన్సూర్‌అహ్మద్ అనే వ్యక్తి వద్ద ఎటువంటి రసీదులు లేని రూ.2 లక్షలు నగదును గుర్తించారు. సంబంధిత నగదును సీజ్ చేసి కేసు నమోదు చేయడమే కాకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నగదును ట్రెజరీలో డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రామచంద్ర, జగన్, రామ్‌నాయక్‌లు పాల్గొన్నారు.

నారాయణ కళాశాల విద్యార్థుల విజయదుందుభి


విద్యార్థులను అభినందిస్తున్న డీన్ చంద్రకిశోర్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 12: ఇంటర్ ఫలితాల్లో నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారని నారాయణ విద్యాసంస్థల డీజీఎం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఎంపీసీ విభాగంలో సుధీర్‌కుమార్‌రెడ్డి 466 మార్కులు, సి.షర్మిల 466, పి.అంజలి 466, పి.సృజన 465, ఎం.మాధురి, కె.వీరభువనేశ్వరిరెడ్డి 465, ఎం.శ్రీలేఖ, ఎన్.ధనుష్, ఎ.మోక్షిత, సి.నితిన్‌రెడ్డి, హరికిరణ్‌రెడ్డి, ఎన్.సుజిత, పి.మహ్మద్ హసన్, పి.సాకేత్‌రామ్‌రెడ్డి, ఎం.వెంకటనందిని, ఎల్.చరిత 464 మార్కులు సాధించారన్నారు. బైపీసీ విభాగంలో ఎం.పల్లవి, జోషిణి, మహ్మద్ అలీఖాన్ 435 మార్కులు, చరణ్‌చౌదరి, ఎన్.శార్వత్‌రాజ్ 433 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు ఇంత ఘన విజయం సాధించినందుకు కృషి చేసిన అధ్యాపకులు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీన్ చంద్రకిశోర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మురళీమోహన్, వెంకటస్వామి, రాఘవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సౌజన్య, సుమన్, ఏజీయం చెన్నక్రిష్ణరెడ్డి, వెంకటరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ట్సోలెవెల్-2 ఆల్ ఇండియా మొదటి స్థానంలో శ్రీచైతన్య

- శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం రమణయ్య


ప్రతిభ చాటిన విద్యార్థులతో ఏజీఎం రమణయ్య, తదితరులు

సికెదిన్నె, ఏప్రిల్ 12: దేశవ్యాప్తంగా మూడవ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు జరిగిన ఇన్‌ట్సోలెవెల్-2 పరీక్షా ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థలు తిరుగులేని ఆదిపత్యాన్ని చాటాయని ఏజీఎం రమణయ్య తెలిపారు. కడపజోన్ నుంచి అత్యధికంగా ఆరుగురు విద్యార్థులు ల్యాప్‌ట్యాప్‌లు, 13 మంది విద్యార్థులు ట్యాబ్‌లు, 38 మంది స్మార్ట్‌వాచ్‌లు, 2,608 మంది విద్యార్థులు మెడల్స్ సాధించి విజయకేతనం ఎగురవేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో ఆలిండియా టాపర్స్‌గా తీర్చిదిద్దడంలో శ్రీచైతన్య విద్యాసంస్థలు ఎప్పుడు ముందుంటాయన్నారు. ఐఐటీ, నీట్, సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో శ్రీచైతన్య విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడానికి శ్రీచైతన్య విద్యాసంస్థల్లో అమలుపరిచే కార్యక్రమాలు, డైరెక్టర్స్, ఫ్యాకెల్టీనే కారణమన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సురేంద్రనాథరెడ్డి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు. విద్యాసంస్థల్లో పనిచేసే అధ్యాపక సిబ్బంది నైపుణ్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో చోరీ

సుండుపల్లె, ఏప్రిల్ 12: మండల కేంద్రానికి సమీపంలోని బాహుదా నది పీలేరు ప్రధాన రహదారి తిమ్మసముద్రంలో నిర్మించిన చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి హుండీ పగులగొట్టి నగదు, స్వామివారి శూలం అపహరించినట్లు గ్రామస్తులు తెలిపారు. నగదుతో పాటు ఆలయంలోని అయ్యప్ప స్వామి శిలలు, పంచలోహాలతో చేసిన వాటిని అపహరించేందుకు గర్భగుడి తాళాలు పగులగొట్టినట్లు తెలిపారు. పూజారి జయరాం తాను భోజనానికి వెళ్లి తిరిగి వచ్చేలోపు గర్భగుడి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

కమలాపురం రూరల్, ఏప్రిల్ 12: మండల పరిధిలోని పెన్నా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ రుషి కేశవరెడ్డి తెలిపారు. శుక్ర వారం ఆయన మాట్లాడుతూ కోగటం, సంబటూరు పంచాయతీ సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్ తరలించామన్నారు. యజమానులకు జరిమానా విధించినట్లు తెలిపారు.



కూలిన హాస్టల్ గది పైకప్పు

- విద్యార్థులకు తప్పిన ముప్పు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 12: స్థానిక జమ్మలమడుగురోడ్డులోని బీసీ బాలికల వసతి గృహంలో ఒక గది పైకప్పు కూలిపోయింది. అయితే అదృష్టవశాత్తు విద్యార్థులకు ప్రమాదం తప్పింది. ఈ హాస్టల్‌ను 2018 లో ప్రారంభించారు. ప్రస్తుతం వసతి గృహంలో 40 మంది విద్యార్థులు ఉన్నారు. పండుగ సెలవులకు విద్యార్థులు ఊరు వెళ్లగా నలుగురు విద్యార్థులు హాస్టల్‌లో ఉన్నారు. గురువారం రాత్రి ఆ విద్యార్థులు రోజు నిద్రించే గదిలో కాకుండా మరో గదిలో నిద్రకు ఉపక్రమించారు. రాత్రి 10.45 గంటల సమయంలో పెద్ద శబ్దం రావడంతో వాచ్‌మెన్ వెళ్లి చూడగా దంతెలు విరిగి చౌడు మిద్దె గది కుప్పకూలింది. వాచ్‌మెన్ వార్డెన్ సత్యవతికి సమాచారం ఇవ్వగా ఆమె వచ్చి పరిశీలించి.. అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కృష్ణయ్యకు సమాచారం ఇవ్వడంతో ఆయన రాత్రి ఒంటి గంటకు, శుక్రవారం ఉదయం జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసయ్యలు కూలిన గదిని పరిశీలించారు. గది కూలే సమయంలో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో వారికి ఎటువంటి ప్రమాదం జరుగలేదు. శుక్రవారం మధ్యాహ్నం డీఎస్పీ మురళీధర్ సంఘటన స్థలానికి చేరుకునివాచ్‌మెన్, విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సంఘటనపై వసతి గృహ సంక్షేమ అధికారి సత్యవతి మాట్లాడుతూ హాస్టల్ భవనం శిథిలమవుతోందని, మరొక భవనంలోకి మార్చాలని అనేకమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చానని, భవనం మార్చాలనుకున్న సమయంలోనే ఈ సంఘటన జరిగిందన్నారు. కాగా, విద్యార్థి సంఘాల నాయకులు ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వలనే ఈ సంఘటన జరిగిందని విమర్శించారు. ప్రగతిశీల విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు, ఏఎస్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వలరాజు, పట్టణాధ్యక్షుడు పీటర్, మాజీ పట్టణాధ్యక్షుడు నాగరాజు, ఆలిండియా లాయర్స్ యూనియన్ విద్యార్థి విభాగం కోకన్వీనర్ హరితలు మాట్లాడుతూ భవనం మార్చమని వార్డెన్ కోరినా ఉన్నతాధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారని, జిల్లా అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


విద్యార్థులను, వాచ్‌మెన్‌ను విచారిస్తున్న డీఎస్పీ మురళీధర్

'రాచమల్లు ఓటమి చూసేవరకు నిద్రపోము'


మాట్లాడుతున్న శివచందారెడ్డి, కౌన్సిలర్లు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 12: ప్రొద్దుటూరులో రాచమల్లు ఓటమిని చూసే వరకు నిద్రపోమని.. రాచమల్లు అవినీతి అరాచకాలు, ఆధిపత్యం, వేధింపులపై తిరుగుబాటుగానే అసమ్మతి కూటమి కట్టామని.. ఆర్‌బీకే దోపిడీ దౌర్జన్యాలు రూపుమాపేందుకే టీడీపీలో చేరామని సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, కౌన్సిలర్లు వంగనూరు మురళీధర్‌రెడ్డి, మునీర్, మహ్మద్‌గౌస్, రామాంజనేయులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కొర్రపాడురోడ్డులోని శివచంద్రారెడ్డి ఆయిల్ మిల్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లుకు అసమ్మతి కూటమి ఇచ్చిన షాక్‌తో దిక్కుతోచక మా సొంత గ్రామం కానపల్లెకు వందలాది మందని బయటి ప్రాంతాలనుంచి తీసుకువచ్చి బలం ప్రదర్శించాలని చూస్తుంటే జాలేస్తుందన్నారు. వైసీపీలో వుండే ఎంవీఆర్ కుటుంబంపై పోటీ చేసే నేను సర్పంచ్‌ను అయ్యానన్నారు. ఎమ్మెల్యేగా కానపల్లెకు కనీసం రూ.5 లక్షల పనులు కూడా మంజూరు చేయించలేకపోయావన్నారు. వివేకానంద కాలనీని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని చెప్పి మోసం చేశావన్నారు. కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ మేము పార్టీ మారామని ఇష్టానుసారం మాట్లాడిస్తే ఊరుకుంటామనుకున్నావా అన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు వెల్లాల భాస్కర్‌తో పాటు ఆవర్గం నాయకులు పాల్గొన్నారు.

24 మద్యం బాటళ్లు స్వాధీనం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 12: పోరుమామిళ్ల చెక్‌పోస్టువద్ద 24 మద్యం బాటళ్లు స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టి కలసపాడు మండలం మామిళ్లపల్లెకు చెందిన శ్రీనివాసులరెడ్డి వద్ద నుంచి 9 మద్యం బాటళ్లు, బాలగంగరాజు వద్ద నుంచి 15 మద్యం బాటళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వల్లూరులో...

వల్లూరు, ఏప్రిల్ 12: వల్లూరు గాంధీ సెంటరు వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి 19 మద్యం బాటళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. అక్రమంగా మద్యం కలిగి ఉన్నారనే విషయం తెలియడంతో సిబ్బంది దాడి చేసి మద్యం స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఇదేం పన్నుల దోపిడీ

- 15శాతం పన్ను పెంపుపై పెదవి విరుపు
- లబోదిబోమంటున్న పేద మధ్య తరగతి ప్రజలు
- సౌకర్యాలు లేవని ఆవేదన


పన్నులు చెల్లించేందుకు వచ్చిన ఇంటి యజమానులు

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 12: రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న 'విలువ ఆధారిత ఆస్తి పన్ను' విధానంపై తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ప్రతి ఏటా 15 శాతం పన్ను బాదుడుపై సామాన్య మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారం పడుతోంది. ఇదేం పన్ను దోపిడీ అని ఎర్రగుంట్ల నగర పంచాయతీ వాసులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న ఎర్రగుంట్లను 2012లో నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పన్నుల మోత తారాస్థాయికి చేరింది. పన్నెండేళ్లలో దాదాపు 500 శాతానికి పైబడి పన్నులు పెరిగినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి సంవత్సరం 15శాతం పెంచుకుంటూ పోతే కొన్ని సంవత్సరాల తర్వాత మా ఆస్తులు మీకే రాసివ్వాల్సి వస్తుం దేమో అంటూ ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు.

రిజిస్ట్రేషన్‌శాఖ పెంచిన ప్రతిసారి...

ఆస్తి విలువను రిజిస్ట్రేషన్‌శాఖ పెంచినప్పుడల్లా ఇంటి పన్నుల భారం కూడా పెరుగుతూనే ఉంటుంది. ఆశాఖకు ఇంటి పన్ను ముడి పెట్టడంతో ఇంటి యజమానులు బెంబేలెత్తుతున్నారు. రిజిస్ట్రేషన్‌శాఖ సంవత్సరానికో రెండేళ్లకో పెంచుతూనే ఉంటుంది. అద్దె విలువ ఆధారిత పన్నులు కాకుండా ఆస్తి విలువ ఆధారిత పన్నులు ఏపీ ప్రభుత్వం వసూళ్లు చేస్తుండటంతో ప్రతి ఏటా పన్నులు పెరుగుతూనే ఉంటాయి. ఇలా అయితే తాము బతికేదెలా అని పేద మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెం దుతున్నారు. తమకున్న ఆస్తి విలువ పెరగకపోయినా పన్ను మాత్రం ఇష్టానుసారం పెంచేస్తున్నారని వాపోతున్నారు.

రూ.7లక్షలు పెరిగిన డిమాండ్

నగర పంచాయతీలో మొత్తం 10896 ఇళ్లు, ఇతర వాణిజ్య సముదాయాలు, పరిశ్రమల భవనాలు ఉన్నాయి. వీటన్నిటికి పన్ను వసూళ్ల డిమాండ్ గత సంవత్సరం రూ.2కోట్ల 2లక్షలు ఉండగా ఈ సంవత్సరం రూ.2కోట్ల 9లక్షలుగా పెరిగింది. ఇది విజయవాడ నుంచి వచ్చిన డాటాగా ఇక్కడి అధికారులు చెబుతున్నారు. ఇక ఏప్రిల్ నెలాఖరులోగా పన్నులు చెల్లిస్తే 5 శాతం పన్నురాయితీ ఉంటుందని అధికారులు తెలిపారు. తరువాత సెప్టెంబరు వరకు ఎలాంటి అప రాధ రుసం లేకుండా చెల్లించవచ్చునన్నారు.

పన్నుల పెంపు సరే... సౌకర్యాలేవీ..

గత 12ఏళ్లలో ఎర్రగుంట్లలో భారీగా ఇంటి పన్నులు పెరిగాయి. అయితే అందుకు తగ్గట్లుగా ఎక్కడా అభివృద్ధి జరగలేదు. తాగునీరు ఇప్పటికీ కొన్ని చోట్ల వారానికి.. మరికొన్ని చోట్ల పది రోజులకు వస్తున్నాయి. వర్షాలొస్తే నగర పంచాయతీ కంపుకొడుతుంది. వీధుల్లో, ప్రధాన కూడళ్లు, రహదారుల్లో ఎక్కడినీరు అక్కడే నిలిచిపోతుంది. ఎక్కడ చూసినా మురుగు, చెత్తనే కనిపిస్తోంది. వీధుల్లో డ్రైనేజీ సౌకర్యం కల్పించిన పాపాన పోలేదు. కొన్ని చోట్ల మంజూరైన డ్రైన్లను కూడా పనికట్టుకుని వేయకపోవడం గమనార్హం. ప్రకాష్‌నగర్, రాణీ వనం, మెయిన్‌బజార్, ముఖ్యంగా జాతీయ రహదారిలోనే డ్రైనేజీ ఔట్‌లెట్‌లేక నీరంతా రోడ్లపైనే ఆగుతోంది. ప్రకటనల్లోనే అభివృద్ధి తప్ప, కంటికి ఎక్కడా కనిపించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కానీ పన్నులు మాత్రం ప్రతిఏటా పెంచుతూనే పోతున్నారని ప్రజలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వాసు, ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి



ప్రజలకు వివరిస్తున్న వాసు, మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె) ఏప్రిల్ 12: రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవి తెలిపారు. శుక్రవారం కడప నగరం 45వ డివిజన్ బాలాజీనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టబోయే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీని గెలిపించాలని కడప నగర అభివృద్ధి చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజశేఖర్, చంద్రశేఖర్, వికాస్ హరిక్రిష్ణ, జనసేన నేతలు తుంగా రమణయ్య, రంజిత్ కుమార్ పలువురు పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు

పుత్తా సతీమణి సరళమ్మ ఇంటింటి ప్రచారం



సూపర్‌సిక్స్‌పథకాలు వివరిస్తున్న పుత్తా నరసింహారెడ్డి సతీమణి సరళమ్మ

కమలాపురం రూరల్, ఏప్రిల్ 12: ప్రజలను మోసగించిన సీఎం వైఎస్ జగన్‌ను ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సతీమణి సరళమ్మ తెలిపారు. శుక్రవారం నగర పంచాయతీ పరిధిలోని 15,16వార్డుల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో ఆమె పుత్తా జ్యోతిరెడ్డి సతీమణి శివమ్మతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు వివరిస్తూ రాబోయే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ముస్లింల ద్రోహి జగన్



సమావేశంలో మాట్లాడుతున్న ఖాదర్‌బాషా

కమలాపురం రూరల్, ఏప్రిల్ 12: సీఎం వైఎస్ జగన్ ముస్లింల ద్రోహిగా నిలిచాడని టీడీపీ కడప పార్లమెంటు ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్ బాషా అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019 నుంచి అధికారం లో ఉన్న జగన్‌రెడ్డి ముస్లిం మైనార్టీ వర్గానికి ద్రోహం తప్పితే ఎటువంటి మే లు చేయలేదన్నారు. 2014 నుంచి 2019 వరకు బీజేపీతో కలిసి అధికారంలో ఉన్నా కూడా ముస్లింలకు ఎటువంటి ప్రయోజనాలు కల్పించలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ముస్లింలకు అభివృద్ధి పథకాలు అందుతాయన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఆయన కోరారు.

వైఎస్ షర్మిలకు జననీరాజనం

వైసీపీ కవ్వింపు చర్యలకు దీటుగా షర్మిల సమాధానం ● పోటెత్తిన అభిమానం

పులివెందుల/వేంపల్లె/సింహాద్రిపురం/లింగాల, ఏప్రిల్ 12: నియోజకవర్గంలో వైఎస్ షర్మిల బస్సు యాత్రకు విశేష స్పందన లభించింది. వైఎస్ అభిమానులు, కార్యకర్తలు జై వైఎస్సార్ అంటూ నినదించారు. కట్టలు తెంచుకున్న అభిమానాన్ని పోలీసులు సైతం నిలువరించ లేకపోయారు. శుక్రవారం పులివెందుల, వేంపల్లె, సింహాద్రిపురం, లింగాల ప్రాంతాల్లో చిన్నాన్న వివేక హత్య ఉదంతాన్ని షర్మిల ప్రస్తావిస్తూ నాన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డి ఆత్మలు క్షోభిస్తున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. వివేకా హత్యపై పులివెందుల పూలంగళ్ల వద్ద అందరిముందు పంచాయతీ పెట్టుకుందాం అంటూ ఎంపీ అవినాష్ రెడ్డికి వైఎస్ వివేకానంద రెడ్డి కుమార్తె వైఎస్ సునీత సవాల్ విసిరారు. వివరాల్లోకెళితే...

లింగాలలో వైఎస్ షర్మిల మాట్లాడుతున్న సమయంలో రాజశేఖర్‌రెడ్డి ఎలాంటి వారు, వివేకానందరెడ్డి ఎలాంటి వారు అని ప్రజలను అడిగితే వారు జై వైఎస్సార్ అంటూ నినదించారు. ఎంపీగా అవినాష్‌రెడ్డి ఏం చేశారని ప్రశ్నిస్తే ఏం చేయలేదంటూ సమాధానం ఇచ్చారు. వైఎస్ వివేకాను హత్య చేసింది, చేయించింది అవినాష్‌రెడ్డి అని మేము చెప్పామా అని ప్రశ్నిస్తే లేదు సీబీఐ అని అన్నారు. ఓటమి భయం పట్టుకున్నందునే మా సభల్లో కవ్వింపులకు పాల్పడుతున్నారని అంటే జై షర్మిల అని నినదించారు. వైఎస్ షర్మిల, వైఎస్ సునీత మాట్లాడే సమయంలో జై జగన్ అని కొందరు, వైసీపీ జండాలతో కొందరు కవ్వింపులకు దిగారు. వీరినుద్దేశించి వైఎస్ షర్మిల మాట్లాడుతూ అవినాష్‌రెడ్డి ఎంపీగా ఓడిపోతాడనే భయం మీకు ఉంది కాబట్టే ఈరోజు రాజశేఖర్‌రెడ్డి బిడ్డను అడ్డుకుంటున్నారన్నారని దీటుగా సమాధానమిచ్చారు. కొందరు వైసీపీ జండాలు పట్టుకుని రాగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. జై జగన్ అని కొందరు వైసీపీ కార్యకర్తలు నినదిస్తే జై షర్మిల అంటూ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున నినదించారు. కాంగ్రెస్ నేతలు వారిని అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేయగా పోలీసులు వెళ్లగొట్టారు. ప్రసంగం ముగిసిన తర్వాత ప్రజల మధ్యకు వచ్చి వైఎస్ షర్మిల నడుస్తూ అందరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ ముందుకు సాగారు.







వేంపల్లె రోడ్‌షోలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల, పక్కనే వివేకానందరెడ్డి కుమార్తె వైఎస్ సునీత, హాజరైన ప్రజలు - సింహాద్రిపురం సమావేశంలో పాల్గొన్న ప్రజలు

నీరు గారిపోతున్న స్వచ్ఛసంకల్పం





మూలకు చేరిన సైకిళ్లు - పంచాయతీ కార్యాలయం వద్ద తొలగించని చెత్త

కమలాపురం రూరల్, ఏప్రిల్ 12: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ సంకల్పం నీరుగారిపోతోంది. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం కోసం గ్రీన్ అంబాసిడర్‌ను ఏర్పాటు చేశారు. వారు గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతూ వీధివీధిలో చెత్త చెదారాలను సేకరించి తడి, పొడి చెత్తను వేరు చేస్తుంటారు. అయితే వారికి జీతాలు అందకపోవడంతో ఈ పనులు చేయడంలేదు. దీంతో వారికి ఇచ్చిన సైకిళ్లు మూలనపడ్డాయి. తమకు జీతాలు రాకపోతే ఎలా పనులు చేయాలని పారిశుధ్య కార్మికులు ప్రశ్నిస్తున్నారు. మండల పరిధి గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. రాష్ట్రమంతా సైకిళ్లు, బుట్టలు పంపిణీ చేశారు. మరికొన్ని బుట్టలు ఎంపీడీఓ కార్యాలయానికి పరిమితమయ్యాయి. గ్రీన్ అంబాసిడర్లు పనిచేయక పోవడంతో గ్రామాల్లో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోతోంది. పారిశుధ్యకార్మికులకు జీతాలు లేక వారి కుటుంబాల పోషణ భారమైంది. పనులు చేసినా నెలలకొద్దీ జీతాలు రాకపోవడంతో మేమెలా బతకాలని వారు ప్రశ్నిస్తున్నారు. ఒక్కో కార్మికునికి నెలకు రూ.6వేలు, డంపింగ్ యార్డు వాచ్‌మెన్‌కు రూ.6500 పంచాయతీ సెక్రటరీ ద్వారా జీతాలు అందేవి. ఇప్పుడు ఆ జీతాలు అందడం లేదు. డంపింగ్ యార్డుల పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉంది. డంపింగ్ యార్డు వాచ్‌మెన్లు కూడా జీతాలు ఇవ్వకపోవడంతో వారు పనులు మానివేశారు. చెత్త వాహనాలు తుప్పుబడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉంది. దీంతో దోమల దండయాత్ర ప్రారంభమైంది. దోమలు కుట్టి ప్రజలు రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా అధికారులు మొద్దు నిద్ర వీడి పారిశుధ్య కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించి ప్రజలను రోగాల బారిన నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓను వివరణ కోరేందుకు ఫోనులో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

ఇంటర్‌లో 'ఆదర్శ' విద్యార్థుల హవా

వల్లూరు, ఏప్రిల్ 12: ఆదర్శ పాఠశాలలో జూనియర్, సీనియర్ ఇంటర్ పరీక్షల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు అత్యధిక ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ తెలిపారు. జూనియర్ 70 శాతం, సీనియర్ 65 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో వై.విందు 913, బైపీసీలో పూజిత 733, సీఈసీ గ్రూపులో సి.అంజనశ్రీ 895, ఎంఈజీ నుంచి రాజన్న 740 మార్కులు సాధించారు. జూనియర్ ఫలితాల్లో కె.స్పందన 470కి 393, సీఈసీ గ్రూపు నుంచి సృజన 500కు 430 వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థినీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వారికి అభినందనలు తెలిపారు.

నేడు గంగమ్మ తల్లి జాతర



కడప (ఎర్రముక్కపల్లె) ఏప్రిల్ 12: కడప నగరం చిన్న చౌకు ఆర్‌కేనగర్‌లో 13, 14తేదీల్లో కట్ట మీదగంగమ్మ తల్లి దేవస్థానం జాతర మహోత్సవం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. 13న ఉదయం చల్ల కార్యక్రమం రాత్రి 10.30కు గంగమ్మ కథ జరుగుతుందన్నారు. 14న ఉదయం నుంచి జాతర కార్యక్రమం జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో చెప్పారు.

ఇంటర్ ఫలితాల్లో 'న్యూ విక్రం' విజయభేరి



సాబియా లక్ష్మీదేవి నూహు రజిత సాయిగణేశ్ తానియా జుబీన

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 12: ఇంటర్ ఫలితాల్లో స్థానిక కోఆపరేటివ్ కాలనీ న్యూవిక్రం జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారని కరస్పాండెంట్ ఆవుల సుధాకర్ తెలిపారు. ఎంపీసీలో సాయిగణేశ్ 450, రజిత 444, ఎస్.జుబినా 440 నూహు 430 మార్కులు సాధించారన్నారు. ఎంపీసీలో పీఎస్ తనియా 883, పి.లక్ష్మీదేవి 870 మార్కులు సాధించారు. విద్యార్థులను యాజమాన్యం అభినందించింది.

ఇంటర్ ఫలితాల్లో 'శ్రీగాయత్రి' విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న గాయత్రి కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 12: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో శ్రీగాయత్రి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని ప్రిన్సిపాల్ జగదీశ్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో యు.నరసింహ 980, కె.మమత 975 మార్కులు, బైపీసీ ప్రథమ సంవత్సరం ఎస్.మయానాజిలాన్ 417, ఎస్.మున్నా న్ 415, కె.జగదీశ్వర్‌రెడ్డి 414 మార్కులు, ద్వితీయ సంవత్సరం బైపీసీలో కె.వెంకటనరేష్ 980, ఎంఈసీలో జి.రామరజిత 969 మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారన్నారు. విద్యార్థులను జోనల్ ఇన్‌చార్జ్ ఎన్‌పురుషోత్తంరెడ్డి, అధ్యాపక బృందం అభినందనందించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా శివకిశోర్‌రెడ్డి



నియామకపత్రం అందుకుంటున్న శివకిశోర్‌రెడ్డి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 12: బీజేపీ కమలాపురం మండల అధ్యక్షుడిగా శివకిశోర్‌రెడ్డిని నియమించినట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వైరాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కమలాపురంలో శివకిశోర్‌రెడ్డికి నియామక పత్రం అందించిన ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ అనేక సంక్షేమ పథకాలు అభివృద్ధిని చేపడుతోందన్నారు. నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం అభివృద్ధి చెందిన విషయం తెలిసిందేనన్నారు. రాష్ట్రంలో పురందేశ్వరి నాయకత్వంలో బీజేపీ బలపడుతోందని బీజేపీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు.

భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించండి



చెన్నూరులో సూపర్‌సిక్స్ పథకాలు వివరిస్తున్న టీడీపీ నేతలు

చెన్నూరు, ఏప్రిల్ 12: రాష్ట్ర ప్రజలు బాగుండాలన్నా, వారి భవిష్యత్తు బాగుపడాలన్నా టీడీపీని ఆదరించాలని మండల కన్వీనరు కె.విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. చెన్నూరులోని గోదినవీధి, సరస్వతీనగర్, రాజులకాలనీ ప్రాంతాల్లో మండల టీడీపీ నేతలు ప్రతి ఇంటికీ ఐదు నిమిషాలు అన్న పేరుతో ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే అందించే సంక్షేమపథకాలు, గతంలో చేపట్టిన అభివృద్ధి గురించి వివరించారు. సూపర్ సిక్స్ పథకాలు అందుకోవాలంటే అందులో యువత మహిళలు రైతులు బాగుపడాలంటే ప్రతి ఓటు టీడీపీకే పడాలన్నారు. రాష్ట్రంలో సంక్షోభమే తప్ప సంక్షేమం లేదన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్‌మండల అధ్యక్షులు ఆటోబాబు, మండల అధికార ప్రతినిధి లక్ష్మీనారాయణ, కార్యదర్శి అతికారి విశ్వం, యువనేత సుబ్బరాజు, క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

14న ప్రైవేటు విద్యాసంస్థల జేఏసీ సమావేశం

కడప (మారుతీనగర్) ఏప్రిల్ 12: ప్రైవేటు విద్యాసంస్థల సమస్యల సాధన కోసం 14వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రైవేటు విద్యాసంస్థల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం జరుగనుందని కమిటీ కన్వీనర్ పి. మదన్‌మోహన్‌రెడ్డి, ఏపీప్రైవేటు పాఠశాలల జే.ఏసీ ఛైర్మన్ జోగి రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ కడప (మద్రాస్ రోడ్డు-సుశాంత్)లోని కృష్ణా కల్యాణ మండపంలో తలపెట్టిన సమావేశం జరుగనుందన్నారు. ప్రభుత్వం అందించే విద్యార్థుల ట్యూషన్ ఫీజు రీయింబర్స్ మెంట్ కాలేజీ ప్రిన్సిపాల్ బ్యాంక్ అకౌంట్‌లకు జమ చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని కేజీ టూ పీజీ ప్రైవేటు విద్యాసంస్థల కరస్పాండెంట్లు ప్రిన్సిపాల్స్ తప్పక హాజరు కావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : పుత్తా నరసింహారెడ్డి



టీడీపీలో చేరిన వారితో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

పెండ్లిమర్రి, ఏప్రిల్ 12: రాష్ట్రాభివృద్ధి జరగాలన్న, సంక్షేమ పాలన అందాలన్న చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, కావున టీడీపీకి ఓటువేసి ఆదరించాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం చీమల పెంట, చెర్లోపల్లె పంచాయతీల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీలో పుత్తా నరసింహారెడ్డి, కూతురు దివ్యశ్రీ, కోడలు చైతన్య, చెల్లెలు యశోదమ్మ గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి చంద్రబాబు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాల మినీ మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, చీమలపెంట సర్పంచు ప్రతాపరెడ్డి, నేతలు రఘునాథరెడ్డి, సారథిరెడ్డి, చంద్రారెడ్డి, చెంద్రాయుడు, ప్రజలు, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

40 కుటుంబాలు టీడీపీలో చేరిక

పగడాలపల్లెలో మండల టీడీపీ మహిళా నాయకురాలు అంజలి ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో శుక్రవారం 40కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పగడాలపల్లె వాసులు పామిరెడ్డి రామచంద్రారెడ్డి, యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో 40కుటుంబాలు టీడీపీలో చేరాయి.

వీరపునాయునిపల్లెలో...

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 12: టీడీపీ గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కమలాపురం టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి తనయుడు కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. శుక్రవారం మొయిళ్లచెరువు, ఎరమలపల్లె, పోచంరెడ్డిపల్లె, మిట్టపల్లె గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీలో ఇంటింటికీ వెళ్లి టీడీపీ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, గుర్రప్ప, ఓబులేసు, ఓబయ్య యాదవ్, గంగిరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, రాంబాబు, సురేంద్రరెడ్డి, తిరుమలరెడ్డి, బాలగంగిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుత్తా కృష్ణచైతన్యకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో యరమలపల్లె పంచాయతీ మాజీ సర్పంచు రెడ్డిపల్లెకు చెందిన ముక్కర గంగన్నతో పాటు 15 కుటుంబాలు, మొయిళ్లచెరువులో పది కుటుంబాలు, మిట్టపల్లె ప్రసాదరెడ్డి, కేశవరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, పామయ్య, చాపాటి వీరయ్య ఆధ్వర్యంలో మిట్టపల్లె హరిజనవాడకు చెందిన శ్రీరాములు, చాపాటి నాగరాజు, మంగపట్నం పెద్దయ్యతో పాటు 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

మానవ జీవితానికి గురువే దీపం

ప్రొఫెసరు మూల మల్లికార్జునరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 12: తల్లిదండ్రుల తరువాత మానవ జీవితాన్ని అజ్ఞానాంధకారం నుండి వెలుగు వైపు నడిపించడానికి గురువు దారి దీపంలా సహాయపడతారని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసరు మూలమల్లికార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం కడప నగరం రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో రచయితల సంఘం ఆధ్వర్యంలో మోతుకూరు పుల్లయ్య రచించిన తరుణోపాయం పుస్తకావిష్కరణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పుల్లయ్య తన గ్రంథంలో తల్లిదండ్రుల గొప్పదనం, గురువుల ప్రాధాన్యత, ఉత్తమ జీవితానికి కావాలసిన విధివిధానాలు తదితర అంశాలను ఉన్నతంగా చిత్రీకరించారన్నారు. కేవీ రమణారెడ్డి మాట్లాడుతూ తరుణోపాయంలాంటి ఉత్తమ గ్రంథాలు ఆధ్యాత్మిక జీవితానికి ఎంతో ఉపయోగమన్నారు. విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరచారి మాట్లాడుతూ పుల్లయ్య తన గ్రంథంలో సుదీర్ఘమైన వేదాంత విషయాలు చర్చించారన్నారు. కార్యక్రమంలో మండల మురళి, గంగయ్య, బాల ఓబయ్య పాల్గొన్నారు.

నేడు షర్మిల రాక

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 12: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శనివారం సాయంత్రం ప్రొద్దుటూరులో బహిరంగ సభ నిర్వహిస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పీఎండీ నజీర్ తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాయంత్రం వన్‌టౌన్ సర్కిల్ వద్ద బహిరంగ సభ ఉంటుందని, ఆ తర్వాత గాంధీరోడ్డు నుంచి టీబీరోడ్డు, రాజీవ్‌సర్కిల్, శివాలయం సర్కిల్ వరకు రోడ్డు షో ఉంటుందన్నారు. శివాలయం సెంటర్‌లో బహిరంగ సభ ఉంటుందని ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు, వైఎస్ఆర్ అభిమానులు షర్మిల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామయ్య, సుబ్బరాయుడు, ఎంపీజే రాష్ట్ర కార్యదర్శి షేక్ సలీం, తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర జయప్రదం చేయండి

జమ్మలమడుగు, ఏప్రిల్ 12: జమ్మలమడుగులో 13వ తేదీ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేపట్టిన బస్సు యాత్ర జమ్మలమడుగు నియోజకవర్గంలో చేస్తున్న పర్యటనను ప్రజలు, అభిమానులు విజయవంతం చేయాలని జమ్మలమడుగు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పాముల బ్రహ్మానందరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం జమ్మలమడుగులో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు విలేకరులతో మాట్లాడారు. వైఎస్ షర్మిల చేపట్టిన బస్సు యాత్ర జమ్మలమడుగు నియోజకవర్గంలో శనివారం ఉదయం 11.30 గంటలకు ముద్దనూరులోని పాతబస్టాండు కూడలిలో ప్రారంభం అవుతుందన్నారు. అక్కడి నుంచి జమ్మలమడుగు మండలం చిటిమిటిచింతల మీదుగా వైఎస్ఆర్ స్టీల్‌ప్లాంట్ శిలాఫలకాల వద్దకు చేరుకుంటారన్నారు. సాయంత్రం 6 గంటలకు జమ్మలమడుగు పాత బస్టాండు సర్కిల్‌లో ప్రసంగిస్తారన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటస్వామి, మర్రి ప్రకాశం, ప్రసాద్, సీపీఐ నాయకులు ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంచాల పుష్పరాజు, గంధం సునీల్, గోపాల్‌దాస్ యేసుదాసు, దాసరి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

గోపవరం, ఏప్రిల్ 12 : గోపవరం అట్లూరు, బి.మఠం మండల పరిధిలోని అన్ని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనులు చేస్తున్నందున శనివారం ఉదయం 8.30 నుంచి 12 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఏ కుళ్లాయప్ప శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

బీసీల ఆత్మగౌరవం నిలబెట్టే పార్టీ టీడీపీ

జయహో బీసీ సభలో మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరదరాజులరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 12 : బీసీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే పార్టీ తెలుగుదేశం పార్టీనే అని ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పీఎఎస్ఆర్ కాంప్లెక్స్‌లో జయహో బీసీ కార్యక్రమం టీడీపీ బీసీసెల్ విభాగం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలను వంచించడానికి వైసీపీ 56 కుల కార్పొరేషన్లు పెట్టి ఒక్క పైసా నిధులు ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. బీసీలను వైసీపీ దగా చేస్తే టీడీపీ అన్ని రంగాల్లో వారిని పైకి తీసుకొచ్చిందన్నారు. మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ చైర్మన్ వీఎస్ ముక్తియార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం జగన్‌లాంటి అరాచక పాలకున్ని గద్దె దింపడం కోసం ఎన్డీయే కూటమితో పొత్తుపెట్టుకోవాల్సి వచ్చిందన్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రొద్దుటూరులో బీసీలకు టీడీపీ ప్రత్యక్ష ఎన్నికల ద్వారా మున్సిపాలిటీల్లో చైర్మన్లుగా అవకాశం ఇచ్చిందన్నారు. వారు స్వతంత్రులు పరిపాలన సాగించారన్నారు. కానీ నేడు వైసీపీ ప్రభుత్వంలో ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లు ఆయన బావమరిది బంగారురెడ్డి అనుమతి లేకుండా మున్సిపల్ కార్యాలయానికి కూడా వచ్చేందుకు ఇప్పటి చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవికి అధికారం లేదన్నారు. రమేష్ యాదవ్ అనే బీసీ వద్ద 8 కోట్లు డబ్బుతీసుకోని అతనిని చైర్మెన్ చేస్తానని ఎమ్మెల్యే రాచమల్లు చెప్పి మున్సిపాలిటీలో బావమరిది బంగారురెడ్డి ఆధిపత్యం కోసం రమేష్ యాదవ్ కౌన్సిల్లర్‌గా గెలిచాక మోసం చేశాడన్నారు. రమేష్ యాదవ్ తన ఆత్మగౌరవం కాపాడుకోవడం కోసం తన తిప్పలు తాను పడి ఎమ్మెల్సీ తెచ్చుకుంటే అతన్నిప్రొద్దుటూరులోనే తిరగకుండా, లేకుండా చేశాడన్నారు. ఆఖరికి పద్మశాలీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీ ఇప్పుడు ఎక్కడ వుందన్నారు. ప్రొద్దుటూరులో ఒక బీసీ వ్యాపారికి చెందిన 50 కోట్ల ఆస్తిని కేవలం 4 కోట్లకు ఇమ్మని ఒత్తిడి చేస్తే అతను ఇవ్వలేదని అతడు బాలికను వేధించాడని చెప్పి అతనిపై తప్పుడు కేసు పెట్టించి అతన్ని వేధించి భూమి లాక్కున్నారన్నారు. రాచమల్లు కిరణ్‌రెడ్డి వద్ద 2 వేల కోట్ల ఆస్తుల దస్తావేజులు అతని బీరువాల్లో వున్నాయన్నారు. అందరి ఆస్తులు సంరక్షించే వాడిగా వరదరాజులరెడ్డి, భూపేశ్‌రెడ్డిలను గెలిపించుకోవాలన్నారు. సమావేశంలో బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు, సీమాంధ్ర బీసీసంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి క్రిష్ణయ్య యాదవ్, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యాదర్శి తాటిశ్రీనివాసుల యాదవ్, గాండ్ల సంఘం నాయకులు జీసీ పుల్లయ్య,లాయర్ గుర్రప్ప, మల్లికార్జున సుంకర వేణుగోపాల్, జనసేన ప్రతినిధి జిలాన్, కౌన్సిలర్ మునీర్ తదితరులు పాల్గొన్నారు.

20 కుటుంబాలు బీజేపీలో చేరిక



ఆది,భూపేశ్ సమక్షంలో బీజేపీలో చేరిన దృశ్యం

కొండాపురం, ఏప్రిల్ 12: మండలంలోని ఉప్పికాయలపల్లె గ్రామంలో శుక్రవారం 20 కుటుంబాలు ఎన్డీయే కూటమిలో చేరారు.ఎన్డీయే కూటమి జమ్మలమడుగు అసెంబ్లీ అభ్యర్థి మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి, టీడీపీ కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి సమక్షంలో వారు కండువాలు కప్పుకున్నారు.ఉప్పికాయలపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి,గోపాల్‌రెడ్డి,సూర్యనారాయణరెడ్డి, సోమ శేఖర్‌రెడ్డి తదితర 20 కుటుంబాలు ఎన్డీయే కూటమిలో చేరారు. మండల బీజేపీ ఇన్‌చార్జి శివనారాయణరెడ్డి, మండల టీడీపీ,బీజేపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి,నాగిరెడ్డి, నరసింహారెడ్డి,రమణారెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డి మండలానికి చెందిన ముఖ్యనేతలను కలిశారు.

ఎన్డీయే అభ్యర్థులను కలిసిన ఎమ్మార్పీయస్ నాయకులు

ముద్దనూరు ఏప్రిల్12: ఎన్డీయే కూటమి అభ్యర్థులు టీడీపీ కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి,జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డిని శుక్రవారం దేవగుడి గ్రామంలో ఎమ్మార్పీయస్ నాయకులు కలిసి మద్దతు ప్రకటించారు. ఎన్డీయే కూటమితో మాదిగలకు న్యాయం జరుగుతుందని కృష్ణమాదిగ పూర్తి మద్దతు తెలపడం జరిగిందన్నారు. ఎన్డీయే అభ్యర్థులను గెలిపించుకునేందుకు కృషి చేస్తామని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు గంగులయ్య మాదిగ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునుస్వామి, హరికృష్ణ, పాపోడు పాల్గొన్నారు.

కార్యకర్తలతో వరద ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న వరదరాజులరెడ్డి

రాజుపాలెం, ఏప్రిల్ 12 : మండల పరిధిలోని వెంగలాయపల్లె, గాదెగూడూరు గ్రామాల్లో భారీగా కార్యకర్తలతో శుక్రవారం ప్రొద్దుటూరు టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజుల రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం కొనసాగించారు. తనకు, ఎంపీ అభ్యర్థిగా భూపేశ్‌రెడ్డికి సైకిలు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలకు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నంద్యాల కొండారెడ్డి, తోట మహేశ్వర్‌రెడ్డి, వెంగలాయపల్లె మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, నరసింహారెడ్డి, చంద్ర నరసింహారెడ్డి, సూర్య నరసింహారెడ్డి, జగన్‌రెడ్డి, సంజీవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగయ్యనాయుడు, బాలిరెడ్డి, రామ్మూర్తినా యుడు, నరసారెడ్డి, బీవీ సుధాకర్‌రెడ్డి, దేవగుడి గోపాల్‌రెడ్డి, ధనిరెడ్డి రామచంద్రారెడ్డి, దుద్యాల సుబ్బిరెడ్డి, మానికింది ఖాదర్‌బాషా,శ్రీకాంత్‌రెడ్డి, వెంకటక్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యతపై శిక్షణ

జమ్మలమడుగు, ఏప్రిల్ 12: జమ్మలమడుగు నగర పంచాయతీ కార్యాలయ సభాభవనంలో శుక్రవారం సాయంత్రం పంచాయతీరాజ్ ఇంజనీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సంకేపల్లె బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలించినట్లు డీఈ భాస్కర్‌రెడ్డి తెలిపారు. అనంతరం ఏపీఆర్ఆర్‌పీ ప్రాజెక్టు అడ్వైజర్ ప్రభాకర్‌రెడ్డి జమ్మలమడుగు నియోజకవర్గంలోని కొండాపురం మండలం సంకేపల్లె బ్రిడ్జ్ నిర్మాణ పనులను పరిశీలించినట్లు తెలిపారు. ప్రాజెక్టు అధికారి వెంట సూపరింటెండెంట్ ఇంజనీరు, పంచాయతీరాజ్ సర్కిల్, కడప జీవీ శ్రీనివాసరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎం.శ్యాంసుందర్‌రాజు, ఏఈలు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి బొజ్జారోశన్న ఇంటింటి ప్రచారం



గొంటువారిపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న రోశన్న

కాశినాయన ఏప్రిల్12: గొంటువారిపల్లె గ్రామంలో శుక్రవారం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జారోశన్న టీడీపీ, జనసేన,బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహి ంచారు. ఈసందర్భంగా ఉమ్మడి మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు తెలియపరుస్తూ కమలం గుర్తుకు ఓటేయా లని ప్రజలను కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపా ధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు పంగా రవీంద్రారెడ్డి, హోండా రవీంద్రారెడ్డి,కొండా దుగ్గిరెడ్డి,కొండా రామసుబ్బారెడ్డి,బాదుల్లా, సుంకే శీను, ఎల్ శ్రీనివాసులరెడ్డి ,ఓ.రోహిత్‌రెడ్డి,పోలిరెడ్డి, డి.క్రిష్టారెడ్డి, ముడమాల రమణారెడ్డి, హుస్సేన్, క్రిష్ణయ్య,వి.గురయ్య,కొండా నరసింహారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి,డి.క్రిష్టారెడ్డి, పి.పోలిరెడ్డి బీజేపీ నాయకులు సతీష్‌రెడ్డి,మనోహర్‌రెడ్డి, ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా'

పోరుమామిళ్ల, ఏప్రిల్ 12 : బద్వేలు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని బీజేపీ, జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశన్న అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని రెడ్డినగర్, రాఘవేంద్రనగర్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి : రోశన్న

కలసపాడు, ఏప్రిల్ 12 : బీజేపీతోనే అభివృద్ధి అని బొజ్జ కార్తీక్ పేర్కొన్నారు. మండలంలోని మహానందిపల్లె గ్రామపంచాయతీ మహానందిపల్లె, సిద్దమూర్తిపల్లె గ్రామాల్లో శుక్రవారం ఇంటింటి ప్రచారంలో అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బొజ్జ రోశన్న కుమారుడు బొజ్జ కార్తీక్ పాల్గొని మాట్లాడారు. ప్రచారంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ సాదనకారి ఖాజారంతుల్లా, ఉపాధ్యక్షుడు పట్టాభిరెడ్డి, యువ త అధ్యక్షుడు దుగ్గిరెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, బ్రహ్మానందరెడ్డి, రమేష్ వెంకటరామయ్య, కృపానందం, సంజీవరెడ్డి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

50 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరిక

గోపవరం, ఏప్రిల్ 12 : కాంగ్రెస్ అభ్యర్థి ఎన్‌డీ విజయజ్యోతి ఆధ్వర్యంలో మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 50 కుటుంబాలు పార్టీలో చేరాయి. మండలంలోని బ్రాహ్మణపల్లె, రెడ్డివారిపల్లె, ఎస్.రామాపురం, నీరబ్బుల్లాయిపల్లె, రేకలకుంట్ల, సంద్రపల్లె, రామాపురం, రాచాయిపేట, గోపవరం, శ్రీనివాసపురం గ్రామల్లో శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బద్వేలు మున్సిపాలిటీ అధ్యక్షుడు అచ్యుతరాజు, నాయకులు మహబూబ్ బాషా,సాంబయ్య, కదిరయ్య, శేఖర్‌రెడ్డి, డేవిడ్, పగడలా నరసింహ, జకరయ్య, సుధాకర్‌రెడ్డి, చిన్న రామిరెడ్డి,మనోహర్‌బాబు, వెంకటరామిరెడ్డి, రాజారెడ్డి, మద్దిలేటి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌ను సన్మానించిన టీడీపీ నాయకులు

ఖాజీపేట, ఏప్రిల్ 12: మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డిని ఖాజీపేట టీడీపీ నాయకులు ఆదినారాయణరెడ్డి, కమలాపురం గౌస్ మొహిద్దీన్, ప్రతాప్‌రెడ్డి శుక్రవారం ఆయన స్వగృహంలో కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి మద్దతు డీఎల్ రవీంద్రారెడ్డి ప్రకటించడం ఎంతో శుభపరిణామన్నారు. ఈ ఎన్నికల్లో పుట్టా సుధాకర్ యాదవ్ గెలుపు తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యులు, షమి, తదితరులు పాల్గొన్నారు.



మాస్టర్స్ విద్యార్థుల ప్రభంజనం



చక్రిక, సారామరియం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 12: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో మాస్టర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ కళాశాల కరస్పాండెంట్ సంజీవరాయుడు, ప్రిన్సిపాల్ మునిశ్రీనివాసులరెడ్డి తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంఈసీలో చక్రిక 1000కి 972 మార్కులు సాధించగా సీఈసీలో సారా మరియం 960 మార్కులు, నూర్‌మహమ్మద్‌ఇర్ఫాన్ 954, మహేష్ 946, రాహిష్ 943 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంఈసీలో సాయిరక్షిత 485, నాగధనుశ్రీ 483, మహమ్మద్ బషీద్ 473, చైతన్య 467, సీఈసీలో సానియా తబసుమ్ 471, అబ్దుల్‌హమీద్ 451 మార్కులు సాధించి ప్రతిభ కనపరిచారు. ఆ విద్యార్థులను కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, డైరెక్టర్ సంజీవరాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

దీప్తి విద్యార్థుల విజయఢంకా



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 12: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో దీప్తి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారని ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో వినీత 988, హర్షిణి 985 మార్కులు సాధించగా బైపీసీలో సాయివర్షిత 974, షాహిద్‌వల్లి 970 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో శరణ్య 465 మార్కులు, మహిధర్‌రెడ్డి 464, హరిణి 463, హర్షిత 462, ఇమామ్‌బీ, వెంకటజశ్వంత్, మహమ్మద్‌షఫి 461 మార్కులు సాధించారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులను ప్రిన్సిపాల్, డైరెక్టర్లు సునీల్‌బాబు, బాలసుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

శ్రీవిద్య విద్యార్థుల విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 12: శ్రీవిద్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచారని ప్రిన్సిపాల్ రమణరావు తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో హరిణి 982, ఎంపీసీలో భరత్ 985, ధరణీధర్ 985, అఫీషా 984, స్పందన, నందిని, కుముదిని, తనూజలు 983, రేణుకాలక్ష్మి 978 సాధించారన్నారు. మొదటి సంవత్సరం బైపీసీలో తహసీన్ 427, రామతునీషాబేగం 425, సానియా 421, నౌస్మిన్‌బాను 417 మార్కులు సాధించారు. ఎంపీసీలో ఉషశ్రీ, సాహితీ 463, నవాల్ 462, యోషిత, లిఖిత 462, గీతాంజలి, గాయత్రి, నస్రిన్ 461, సుహానా, నవ్యశ్రీ, తేజశ్విని 460 మార్కులు సాధించారన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, రామమోహన్, అధ్యాపకులు అభినందించారు.

భావన విద్యార్థుల సంచలనం



హర్షిత, వీరగణేష్

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 12: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో భావనా జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనపరిచారని కరస్పాండెంట్ రాజారెడ్డి తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో వీరహర్షితారెడ్డి 937 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరం ఎంపీసీలో వీరగణేష్, కమాల్‌బాష 461 మార్కులు సాధించగా ఇతర విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని తెలిపారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులను కరస్పాండెంట్, డైరెక్టర్ షమీవుల్లా, అధ్యాపకులు నరసింహారెడ్డి తదితరులు అభినందించారు.

విజ్ఞాన్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థుల హవా



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 12: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో విజ్ఞాన్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరీ మోగించారని ప్రిన్సిపాల్ ఖాజామొహిద్దీన్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో రుక్సానా 923, ఇర్ఫానా 963, శ్రీవాణి 933, గీతాంజలి 932, బైపీసీలో రిజ్వానా 983, కెజియా 974, సునానా 972 మార్కులు సాధించారు. సీఈసీలో యాసిరాఫిర్దోస్ 945 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో సాదియా 463, అఫీఫా నస్రిన్ 451, బైపీసీలో చాను 421, సీఈసీలో వాసిమా సుల్తానా 464, యుఫియా 455 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, డైరెక్టర్లు సుదర్శన్‌రెడ్డి, ఆలీఅక్బర్, సుదర్శన్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

అభ్యాస్ జూనియర్ కళాశాల విద్యార్థుల విజయకేతనం



ప్రతిభ కనపరిచిన విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 12: అభ్యాస్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని ప్రిన్సిపాల్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో వైష్ణవి 989, లాస్యప్రియ, యశశ్విని 984, శ్రీచరిత 983 మార్కులు సాధించారు. బైపీసీలో హబ్బాతబసుమ్ 976, ముబీన్ 975 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో అరవింద్ 466, షణ్ముక సాయిగణేష్, ప్రసన్నలక్ష్మి, చైతన్యకుమార్, శ్రావ్య 465, మానస, జయహంసిక, పవన్‌సాయి 462, మోక్షిత 461 మార్కులు సాధించారు. బైపీసీలో హరిచందన 427 మార్కులు సాధించారు. ఆ విద్యార్తులను ప్రిన్సిపాల్, కరెస్పాండెంట్ బచ్చల వీరప్రతాప్, అధ్యాపకులు అభినందించారు.

నారాయణ విద్యార్థుల విజయఢంకా

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 12: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయఢంకా మోగించారని ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో షర్మిల, సుధీర్‌కుమార్‌రెడ్డి 466, వెంకటనందిని 464, ప్రణయ్‌సాయి 470, పల్లవి, జ్యోతి 435, షాకియాఫిర్దోస్ 440, రోహిని 440 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో లలితాపావని 987, యశశ్విని 984, కార్తీక్‌రెడ్డి 981, రీతు 978, జాహ్నవి 977, బైపీసీలో మేఘన 986, అఫ్రీన్‌భాను 985, సారాఖనమ్ 981 మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, డీజీఎం రామమోహన్‌రెడ్డి, డీన్ చంద్రకిశోర్‌రెడ్డి, ఏజీఎం జ్యోతివెంకటరామిరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

అనురాధ అరుణ కోడలు మీనా

మహిళల అభ్యున్నతి కూటమితోనే సాధ్యం



ప్రచారంలో పాల్గొన్న వరదరాజులరెడ్డి కుమార్తెలు

ప్రొద్దుటూరు ఏప్రిల్ 12 : మహిళల అభ్యున్నతి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కుమార్తెలు మెట్టుపల్లి అనురాధ, వెన్నపూస అరుణ, కోడలు నంద్యాల మీనా తెలిపారు. శుక్రవారం 31 వవార్డులో కూటమి మహిళా సభ్యులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగా శివకల్యాణి, టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు బోగాల లక్ష్మీనారాయణమ్మ, లక్ష్మీ, అలివేలు,శైలజ అంజనమ్మ, భానుమతి, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఖాదరబాద్ ప్రచారంలో వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 12 : టీడీపీ అధికారంలోకి వస్తేనే అందరి జీవితాల్లో మార్పు వస్తుందని లేకుంటే రాష్ట్రం అధోగతి పాలు కాక తప్పదని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కొత్త పల్లె పంచాయతీలోని ఖాదరబాద్‌లో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణు గోపాల్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికి ప్రచారం చేశారు. కార్యక్రమంలో కొత్లపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి , దేవగుడి గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ మునీర్, జనసేన ప్రతినిధి లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.